# IIవ 'సోమేపల్లి' సాహితీ పురస్కారాల చిన్నకథల పోటీలలో ప్రోత్సాహక బహుమతి పొందిన కథ



## ఆకలి

- వలివేటి నాగచంద్రావతి
9440577715

**ఒ**రిగి పడుతున్న ఐరావతం లాంటి ఆ బ్రహ్మాండమైన తెల్లటి భవనం ముందు 'మహేంద్రా కేటరర్స్' అని రాసి వున్న వేన్ వచ్చి ఆగింది.

అందులోంచి దూకినట్టుగా దిగాడు రామచంద్రం. వాను నిండా కిక్కిరిసినట్టుగా వంట సామాను. మరో ఆరు వంట వాళ్ళూనూ- కాళ్లు కదుపుకోటానికి వీల్లేకుండా ఉతుకుష్టంగా కూర్చున్నాడేమో, దిగేసరికి చాలా హాయిగా అనిపించిందతనికి.

ఉదయపు చల్లగాలిని ఆస్వాదిస్తూ ఓ క్షణం నుంచున్నాడో లేదో డ్రయివరు పక్క సీట్లోంచి దిగొచ్చిన వంట మాస్టరు "ఏరా షావుకార్లా నిలబడ్డావ్, సామాన్లు దించకుండా" అని అదిలించాడు.

వాళ్ల జట్టులో అందరికంటా చిన్నవాడు రామచంద్రం. నిండా పద్నాలుగేళ్లన్నా లేవు వాడికి. పన్లో చేరి నెలన్నా కాలేదు. అంచేతేమో రామచంద్రం అంటే కొద్దిగా అలుస తనికి.

పక్కనే ఉన్న టౌన్‌లో వుంది వాళ్ల సంస్థ. రెండు రోజుల క్రితం వారి యజమాని వర్కర్లందర్నీ పిలిచి చెప్పాడు "పెద్ద కాంట్రాక్టొకటి ఒప్పుకున్నాను. పక్క వూర్లో ఓ పెద్దాయన దినకార్యం కోసరం వంటకి వెళ్ళాలి మనం" అని.

చిన్న ఫంక్షన్లకీ, దగ్గర ప్లేసులకీ అయితే ఆ ధరువులూ పిండివంటలో చేసేసి తీసుకు వెళ్ళి పోతుంటారు. ఇలా పక్క వూర్లకీ పెద్ద పెద్ద ఫంక్షన్లకీ అయితే సంబరాలూ పరివారంతో సయితం వెళ్లి అక్కడే వండి వడ్డిస్తుంటారు. ఇక్కడ కొచ్చింది అందుకోసమే.

అంతా కలిసి వేన్‌లోంచి పాత్ర సామాన్లన్నీ కిందికి దింపారు. ఈలోగా వంట సంబారాలతో మరో మినీ లారీ వచ్చేసింది. మూటల్లో డబ్బాల్లో అట్టపెట్టెల్లో దిగుతున్న ఆ సామాగ్రిని నోరు వెళ్ల బెట్టి చూశాడు రామచంద్రం.

'దినకార్యం' ఇంత ఘనంగా చేస్తారా..? ఓ సన్న బాధావీచిక వాడి మనస్సులో. వాడి తండ్రి ఓ ఫ్యాక్టరీ మెకానిక్. ఓ ప్రమాదంలో ఆ ఫ్యాక్టరీ తాలుకూ రాక్షస చక్రాలలో పడి నలిగి పోయాడు. ఆ మాంసం ముద్దకే దహన సంస్కారం జరిపించింది తల్లి. పదోనాడు గుళ్లో బ్రాహ్మణుడికి స్వయంపాకం ఇప్పించి నమస్కారం చేయించింది. తన తండ్రి స్నేహితులు నలుగురు ఆ రోజు ఇంట్లో భోంచేసి వెళ్లారు. దాంతో దినవారాలు పూర్తయ్యాయి. ఆగని నిట్టూర్పు బయటకు ఉరికింది

నానీ: అందని పండు/ పుల్లన అనవద్దు/ ఎదగాలి/ అందుకునే వరకు
- బొబ్బిలి జోసెఫ్

రామచంద్రానికి.

ఇంటి వెనక వైపు వంట కోసం వేసిన షామియాన కిందకు గుండిగ మోసుకు వెడుతూ "ఆ చచ్చిపోయిన పురుషోత్తంగారున్నాడే– కొడుక్కి రెండొందల కోట్లు అప్పగించి పోయాట్ట... రెండొందల కోట్లు.. ఆ.." అన్నాడు రమణ. తెలిసిన దాన్ని కడుపులో దాచుకోటం అస్సలు చేతకాదతనికి.

"ఊ..ఊ... కబుర్లు తరవాత. చప్పున సామాను సద్ది పని మొదలు పెట్టండి. నాలుగు రకాల టిఫిన్లు కావాలట బ్రేక్‌ఫాస్ట్‌కి. పదింటికల్లా" హడావిడి చేశాడు వంటమేస్త్రి.

వాళ్లొచ్చినప్పుడున్న మనక చీకట్లు విడిపోయాయి. తెల్లగా తెల్లారిపోయింది. భవనంలో సందడి మొదలయినట్టుంది. బంధువులూ స్నేహితుల రాకడ, విచార సూచక పరామర్శలూ గాద్గదిక సమాధానాలూ సన్నగానూ, "అవి తెచ్చారా, ఇవి తెచ్చారా" అంటూ అజమాయిషీ చేసే వారి హడావిడి పెద్దగానూ వినిపిస్తున్నాయి.

మా పని మాదే అన్నట్టుగా పనిలో పడ్డారు వంటవారందరూ. స్టౌల మీద పాత్రలు ఎక్కాయి. తిరగ మూతలు చిటపటమంటున్నాయి. గరిటలు గర్రు గర్రున చప్పుళ్ళు చేస్తున్నాయి. వంట చేస్తున్న వాళ్లకి కావలసినవన్నీ అందిస్తూ గిరగిర తిరుగుతున్నాడు రామచంద్రం. వాడి కుతుహలమంతా వరండాలో హాలుకి ఆనుకుని వున్న కిటికీ మీదే వుంది. పంచదార తేవటానికనో, పనీర్ పాకెట్ వెతకటానికనో వంకపెట్టి కాస్సేపక్క డక్కడే తచ్చాడు తున్నాడు. కిటికీలోంచి హాల్లోకి తొంగి చూసి వస్తున్నాడు.

* * *

పెద్ద సావడి అది. ఒక పక్కంతా అతిథులు ఆశీనులయి ఉన్నారు. ఈశాన్యం వైపున్న స్థలంలో కర్మకాండ జరుగుతోంది. ఇంకో పక్క దాదాపు పాతికమంది బ్రాహ్మణులు మఠం వేసుకు కూర్చున్నారు. దానాల కోసం నాణ్యమైన ఎన్నో వస్తువులు తెచ్చి వుంచారక్కడ.

కీర్తిశేషులైన పురుషోత్తం గారి కుమారుడు రాజశేఖరం గారు దీక్షా వస్త్రాలతో శ్రద్ధగా కర్మకాండ నిర్వహిస్తున్నారు. పురోహితుల వారు ఉచ్ఛైశ్వరంతో మంత్రపఠనం గావిస్తూ మృతి చెందిన ఆత్మకు శాశ్వత బ్రహ్మలోక వాసం కలగాలని ఆశీర్వదిస్తున్నారు. మధ్య మధ్య కర్త చేత 'అస్మత్' అనీ, 'మమ' అనీ అనిపిస్తూ పితృణం తీరుస్తున్నారు.

'ప్చ్... నేనివేమీ చేయలేదు. మా నాన్నని ఏ లోకానికి తీసుకు వెళ్లారో ఏమిటో" అనుకున్నాడు రామచంద్రం.

* * *

పురుషోత్తంగారు ఒకానొకనాడు ఊరికి మహారాజంతటివారు. వారి పుత్రరత్నం రాజశేఖరం రాజ్యసభ సభ్యత్వం దక్కించుకుని ఊరు దాటి వెళ్లిన యువరాజు. వారి బోటి ప్రముఖులకు ఆశ్రితులూ, సహచరులూ కొదవా?

టిఫిన్ టయానికి ముఖ్య అతిథులూ, వారి అనుచర గణాలూ, బంధువులూ, గుంపులుగా చూడొచ్చిన వూరి జనాలతో ప్రాంగణమంతా వేసిన షామియానాలన్నీ నిండిపోయాయి.

లోపలంతా విషాదం కథ. అరగంట రిలీఫ్ ఇక్కడ. ఫలహార శెక్షన్ పూర్తయింది.

"ఇవన్నీ ఏం చేయటం?" అడిగాడు రామచంద్రం రెండు పెద్ద పెద్ద కంటెయినర్ల నిండా వున్నాయ్ తీసేసిన సింథటిక్ ప్లేట్లు.

'అమాయకుడా' అన్నట్టు చూశాడు రామ్మూర్తి. క్లీనింగ్ బాధ్యత అతనిదే.

"ఆ గోడవతల గోల వినిపించట్లా? వీటి బంధు బలగం వీటి కోసమే కాచుకున్నారక్కడ"

అర్థమయ్యింది ఆ చుట్టాలెవరో! కాస్సేపు స్తబ్దుగా అయిపోయేడు రామచంద్రం. ఆ తర్వాత ఇద్దరూ సాయంబట్టి ఆ కంటెయినర్లని ఇంటి వెనకనున్న గేటు దగ్గరకి చేరేశారు. తాళం తెరిచి మూసున్న గేటు తెరిచాడు రామచంద్రం. అంతే. ముప్పయి నలభై చర్మ సహిత అస్థిపంజరాలు

**కవులకు ఆహ్వానం:** అక్టోబర్ 6న విజయవాడలో 'ఎక్స్‌రే' ఆధ్వర్యంలో జరిగే నెలనెలా వెన్నెలలో కవితాంశం 'జీవితం అర్థంకాని లిపి'. ఈ అంశంపై కవులు కవితలు రాసి చదవవచ్చు.

69

విరుచుకు పడినయ్ కంటెయినర్ల మీదికి.

ఆబగా ఆశగా ఆకలిగా తుంచేసిన, ఉంచేసిన, కెలికేసిన కొరికేసిన ఆ ఎంగిలి పలహారాల కోసం వెతుకులాట... పెనుగులాట... కొట్లాట... క్షుద్భాధ చేస్తోన్న వికట తాండవం అది.

మొహంపక్కకి తిప్పేసుకున్నాడు రామచంద్రం. 'ఈ ఉచ్ఛిష్టం కోసమే కదూ ఒకరోజు తానూ నోరు తెరిచిందీ-' అనాటి దర్ధశని తలుచుకుంటే ఇప్పటికీ తన మీద తనకే జాలేస్తుంది రామచంద్రానికి.

* * *

ఏమరుపాటుగా వున్నప్పుడు వెనకనించి విధి వేసిన వేటు తండ్రి దుర్మరణం. తల్లి తండ్రి చెల్లితో సాఫీగా సాగుతోన్న జీవితం ఒక్కసారిగా తలకిందులయి పోయింది. ఫ్యాక్టరీ యాజమాన్యం విసిరిన పరిహారం అప్పులిచ్చిన కాకులు ఎత్తుకుపోయాయి. ఆరు నెలలు తిరక్క మునుపే పిల్లలకి అన్నం పెట్టడం కోసం తల్లి వంటలకి వెళ్లాలిసొచ్చింది. పన్నిండేళ్ళ చెల్లెల్ని చేతి సాయం వంకతో ఓ డబ్బున్న చుట్టం ఇంటికి పని పిల్లగా పంపాల్సి వచ్చింది. తన చదువు అయోమయంలో పడిపోయింది.

రామచంద్రకి బాగా జ్ఞాపకం తల్లికి వారం రోజులుగా జ్వరం. మంచం దిగలేదు. పనికి వెళ్లలేదు. ఉన్న డబ్బు డాక్టరు ఫీజుకీ మందులకీ ఖర్చయిపోయింది. ఇంట్లో వండటానికేమీ మిగల్లేదు. ఆ రోజు తల్లి దేవుడి ముందు ముగ్గు వేసేందుకు వుంచుకున్న బియ్యప్పిండి గుప్పెడు జావలా కాచి తల్లికి పట్టించేడు. తనకదీ లేదు. ఆకలి మంట- కడుపులో నిప్పు రాజేసినట్టు. ఏ మంటయినా నీళ్లు చల్లితే చల్లారుతుంది. ఈ మంట ఎన్ని నీళ్లు తాగినా చల్లారలేదు. పొట్ట నొక్కుకుంటూ తిరిగాడు. నీరసమొచ్చింది. నిస్సత్తువగా పడుకుండి పోయాడు.

మధ్యాహ్నమవుతుండగా కళ్లు తెరిచి- "గుళ్లో ప్రసాదం పెడుతున్నారు నాన్నా" అన్నది తల్లి గొంతు పెకలించుకుని. పరిగెత్తి వెళ్లాడు రెండు సందులవతలున్న వీధిలోకి. వేళ మించి పోయింది. ప్రసాదం దొరకలేదు. నిస్సత్తువగా ముడుకుల్లో తల దూర్చి గుడి మెట్లమీద కూర్చుండి పోయాడు.

ఒంట్లో త్రాణలేక మాగన్నుగా నిద్ర పట్టిందేమో, ఏవో కలకలం వినిపించి కళ్లు తెరిచాడు. గుడికి ఆనుకునున్న కళ్యాణమండపంలో పెళ్లి గావును. అప్పుడే భోజనాలు అయినట్టున్నాయి. తీసేసిన విస్తరాకులు టేబుల్ మీద వేసిన కాయితాలతో సహా చుట్టేసి విసిరేశారు గోడ పక్కన. ఈగల్లాగ ముసిరిపోయారు వాటి హక్కుదార్లు.

ఏవేవో తినుబండారాలు. ఏరుకుంటున్నారు. తన పక్కనే కూర్చుని తింటున్నారు. అదేవిటో వద్దు వద్దని ఎంత బుద్ధి చెబుతున్నా తన కళ్లటే తిరిగి తిరిగి చూశాయి. అగ్నిహోత్రంలా భగ్గు భగ్గుమంటోన్న జఠరాగ్ని నాల్కలు సాచి త్రాహి త్రాహి అంటోంది.

వాళ్లలో తన వయస్సు కుర్రాడు- తన చూపుల్లో ఆకలి పసిగట్టున్నాడు. స్నేహంగా నవ్వాడు. ఆ తర్వాత ముందుకొచ్చి చెయిజాపాడు. దాన్లో ఓ పెద్ద లడ్డూ ముక్క.

ఆ క్షణం లజ్జ అభిమానం, పెద్దకులం అన్న పదాలే గుర్తుకు రాలేదు. అంతేకాదు- తనలోని ఏ అణువూ దాన్ని తిరస్కరించటానికి ఒప్పుకో లేదు. అప్రయత్నంగా చెయి జాపాడు. ఇష్టంగా ఆత్రంగా ఆ ఎంగిలిని స్వీకరిస్తూ తన ప్రాణదాత వంక కృతజ్ఞతగా చూశాడు.

* * *

తిరిగి ప్రస్తుతంలోకి వచ్చాడు రామచంద్రం. ఆ ముష్టివాళ్ల వంక బాధగా చూసి నిట్టూరుస్తూ లోపలికి వచ్చేసాడు రామచంద్రం.

లోపల్నించి మంత్రాల హోరు ఎడతెరిపి లేకుండా వినిపిస్తోంది. వంటశాలలో కూడా హడావిడి అధికమయింది. మధ్యాహ్నభోజనాలకి ఆధరువులు భారీగా చెయ్యాల్సి వుందేమో ఊపిరి సలపని పనిలో నిమగ్నమయి వున్నారందరూ.

రామచంద్రకీ చేతినిండా పనే క్షణం తీరిక

**నానీ:** భావాలూ అక్షరాలూ/ ఏకమయ్యాయి/ పెల్లు బిగింది/ కవిత్వం

- బొబ్బిలి జోసెఫ్

లేకుండానే ఉన్నాడు. అయినా మనస్సాగక, చెట్టు నీడన బిడ్డని వుంచి పనికి వెళ్లిన తల్లిలా మధ్యలో రెండుసార్లు వెనుకవైపు గేటు దాకా వెళ్లి వచ్చాడు. ఆరు బయట ఎండలో మోకాళ్ళమీద కూర్చున్నవాళ్లు కూర్చున్నట్టే వున్నారక్కడ ఆ దరిద్రులు.

అపహార్ణమయింది. వంట దాదాపుగా పూర్తి అయింది. 'ఇంకెంతలే. తతంగం కూడా పూర్తి కావస్తోంది. ఇక భోజనాలవటమే ఆలశ్యం. వీళ్లాకలీ తీరుతుంది కాస్త' అనుకుంటూ వచ్చేశాడు.

కర్మకాండ పూర్తయింది. భోజనాలు మొదలయ్యాయి. వడ్డన చేసేటప్పుడు అతిథులు వదిలేస్తున్న వ్యంజనాల వంక తృప్తిగా చూస్తు న్నాడు రామచంద్రం.

మొదటి బంతి పూర్తవుతున్నప్పుడు వచ్చాడు- అందరిమీదా పెత్తనం చేస్తూన్న ఓ పెద్దాయన- "తీసేసిన విస్తర్లు పెరటి వాకిలి వెనుక పడేయొద్దు. పొద్దున్న ఆ ముష్టి వెధవలూ కుక్కలూ కలిసి నానా గలీజు చేసి పారేసారక్కడ ఛండాలంగా. మునిసిపాలిటీ వాళ్ళ డంపిన్స్ తెప్పించాను రెండు. వాటిల్లో వేసెయ్యండి. సరాసరి డంపింగ్ యార్డుకి వెళ్లిపోతుంది చెత్త" అని పిడుగు వేశాడు.

'చివరికి ఆ మెతుకులు కూడా దక్కనీరా ఆ అభాగ్యులకి' తల్లడిల్లాడు రామచంద్రం. 'ఆకలి పెట్టే బాధ ఎంత దారుణమైనదో తనకి బాగా తెలుసు. ఆనాడు తన కడుపులో ఆకలి రేపిన కల్లోలం, చాపిన ఆ కుర్రవాడి చేయి, ఆ చేతిలో లడ్డూ ముక్క- పదే పదే అవే మెదులుతున్నాయి మనసులో. రుణం తీసుకుని మొహం చాటు చేసుకున్నట్టు ఏదోకించ.

ఆలోచిస్తూ పరధ్యానంగా పాయసం దబరా మీద మూత సరిగా వేయబోతూ ఉలిక్కి పడ్డాడు- పళ్ళెం అంచు చివరన పెద్ద బొద్దింక. చిరాగ్గా విదిలించబోయి తల్లో ఏం మెరిసిందో తెలీదు- 'అయ్యయ్యో- బొద్దింక-పాయసం గిన్నెలో-' అని గొంతు పెంచి అరవసాగాడు గగ్గోలుగా.

మరుక్షణం పదిమందున్నారు ఆ గిన్నె చుట్టూరా. రామచంద్రం గరిటపెట్టి దాన్ని తీసెయ్యటానికి ప్రయత్నించే కొద్దీ అది లోలోపలికి మునిగిపోటం లోపల్నించొచ్చిన నలుగురు బంధువులతో సహా అంతా కళ్లారా చూశారు. కావాలనుకున్న డామేజ్ ఏదో అయిపోయింది.

"ఛీ..ఛీ.. అది వడ్డించకండి. మళ్లా తయారు చేయించండి" పురమాయించారు అలా చెప్పగల అధికారమున్న వారెవరో.

అప్పుడక్కడే వున్నాడు మహేంద్రా కేటరింగ్ యజమాని. కందగడ్డయిపోయిందాయన మొహం. ఇహ ఆ తర్వాత చెప్పడానికేముంది?

అంత అజాగ్రత్తగా వుంటమే కాదు- ముఖ్యంగా అలా వెల్లడయ్యిపోయేలా అల్లరి చేసినందుకు తల వాచేటట్లుగా తిట్లు చివాట్లు చెంపల వాయింపు. ఆ బాధ్యతారాహిత్యానికి శిక్షగా వన్లోంచి తొలగింపు. ఏ సెక్షన్ ప్రకారమో తెలీదు గానీ సదరు ముద్దాయికి ఈ ప్రకారంగా దండన విధించటమైనది. ఎవరెన్నంటున్నా దూషణ భూషణ తిరస్కారాలకతీతంగా నిర్వికారంగా నిలబడ్డాడు రామచంద్రం.

"పో..ఇక్కణ్ణించి" ఒక్క తోపు తోశాడు యజమాని. నిర్విచారంగా బయటకు వచ్చాడు రామచంద్రం. కంటికి ఇంపుగా.. మనసుకు ఆహ్లాదంగా అనిపించే దృశ్యమక్కడ!

జీడిపప్పు యాలకులతో ఘుమఘుమలాడే పాయసాన్ని గుమిగూడిన ఆ బిక్షుకులకి అడిగినంత వాళ్ల గిన్నెల్లో పోస్తున్నారు రమణా రామ్మూర్తీ. వాళ్ల మొహాల్లో ఆకలి తీరుతున్న ఆనందం. అన్నమడిగితే అమృతం దొరికిందన్న సంతోషం.

అప్పటివరకూ మనసును తొలుస్తున్న శంక తొలగింది. అతను కోరుకున్నది అదే. సంతృప్తిగా ప్రశాంతంగా బస్టాప్‌కేసి నడిచాడు రామచంద్రం.

అతని కొక్కడికే తెలుసు పాయసంలో పడింది బొద్దింక కాదు, తన జేబులోవున్న రబ్బరు బొమ్మని. ప్రొద్దుట ఇంటిముందు దొరికితే చిన్నతనం పోక జేబులో వేసుకున్నాడు దాన్ని.

**వచ్చే సంచికలో-: పోస్ట్ కార్డ్ కథలు, కవితలు, సమీక్షలతో ఎక్కువ రచనలతో వెలువడుతున్నది.**